

కృష్ణమ్మ పరవళ్లు..

వరద నీటితో కృష్ణమ్మ నిండుకుండను తలపిస్తోంది. విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి దిగువకు ఉధృతంగా ప్రవహిస్తోంది. జల సవ్వడులు తిలకించేందుకు క్యూ కడుతున్నారు.



పడిగాపులు

పెడన: యూరియా కోసం రైతులకు పడిగాపులు తప్పడం లేదు. ఉమ్మడి జిల్లాలో పలు గ్రామాల వద్ద రైతులు పనులు మానుకుని ఎరువుల కోసం క్యూ కట్టారు.

సమస్యల పరిష్కారానికి వినతి



భవానీపురం: దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ దివ్యాంగుల విభాగం మాజీ అధ్యక్షుడు బందెల కిరణరాజ్ ఏపీ దివ్యాంగుల, వయోవృద్ధుల, హిజ్రాల స్త్రీ శిశు సంక్షేమ రాష్ట్ర డైరెక్టర్ ప్రకాష్ రెడ్డికి శుక్రవారం వినతి పత్రం అందజేశారు.

న్యూస్‌రీల్

ఎరువుల కొరత వాస్తవమే

మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగారురాజు



చిలకలపూడి(మచిలీపట్నం): రాష్ట్రంలో ఎరువుల కొరత ఉన్న మాట వాస్తవమేనని మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగారురాజు అంగీకరించారు. వ్యవసాయాధికారులు జిల్లాల వారీగా రైతులకు ఎంత ఎరువులు అవసరమవుతాయో ముందస్తు ప్రణాళికలు రూపొందించకపోవడంతో ఈ పరిస్థితికి కారణంగా చెప్పారు. మచిలీపట్నంలో శిథిలావస్థలో ఉన్న మార్క్‌ఫెడ్ గోదాములు, ఖాళీ స్థలాన్ని ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో సమయానుకూలంగా వర్షాలు రావటం అంతే కాకుండా ఒకేసారి రైతులందరూ సాగు ప్రారంభించడంతో ఎరువుల కొరత తీవ్రంగా ఏర్పడిందన్నారు. కృష్ణాజిల్లాలో సహకార సంఘాలకు 12,627 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు సరఫరా చేశామని తెలిపారు. మచిలీపట్నంలో మార్క్‌ఫెడ్‌కు సంబంధించిన భూమిలో రూ. 6 కోట్లతో రెండు గోడౌన్లు నిర్మించేందుకు బోర్డు నిర్ణయం తీసుకుందని మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగారురాజు వెల్లడించారు. రాష్ట్రంలో మార్క్‌ఫెడ్ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ మురళీకిషోర్, డీఈ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

కానిస్టేబుల్ అభ్యర్థుల సర్టిఫికెట్‌ల పరిశీలన



కోనేరుసెంటర్: ఏపీ స్టేట్ లెవల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఆధ్వర్యాన జరిగిన వివిధ పరీక్షల్లో కానిస్టేబుల్ ఉద్యోగానికి అర్హత సాధించిన అభ్యర్థుల సర్టిఫికెట్‌ల పరిశీలన శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని సమావేశ మందిరంలో జరిగింది. ఎస్పీ ఆర్.గంగాధరరావు అభ్యర్థులతో మాట్లాడి సర్టిఫికెట్లను ఆయన స్వయంగా పరిశీలించారు. అభ్యర్థుల విద్యార్హతలు, క్రీడా సర్టిఫికెట్లు, కేటగిరీకి సంబంధించి ధ్రువపత్రాలను పరిశీలించి సిబ్బందికి అవసరమైన సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ ఈ నెల 23, 25, 26 తేదీల్లో కూడా కొనసాగుతుందని అభ్యర్థులు తప్పనిసరిగా హాజరుకావాలని ఎస్పీ తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు క్రమశిక్షణ, నిబద్ధతతో శిక్షణ పూర్తి చేసుకుని ప్రజాసేవలో భాగస్వాములు కావాల్సి ఉంటుందని చెప్పారు.

దుర్గమ్మకు విరాళాలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు శుక్రవారం పలువురు భక్తులు విరాళాలు సమర్పించారు. అమ్మవారి నిత్యాన్నదానానికి నిడమానూరుకు చెందిన శివరామకృష్ణ ప్రసాద్, జ్యేష్ఠ దంపతులు రూ. లక్ష విరాళాన్ని అందజేశారు. ఏలూరుకు చెందిన పి.శ్రీరామ్ సీతారామయ్య, ప్రియాంకల కుమారుడు త్రిలోక్య, ఆర్యల పేరిట ఆలయ అభివృద్ధి పనులకు రూ.1,00,005 విరాళాన్ని అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. ప్రసాదాలు అందజేశారు.

దసరా ఏర్పాట్ల పరిశీలన



లబ్బీపేట(విజయవాడతూర్పు): దసరా మహోత్సవాల్లో అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు ఉండాలని పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు అన్నారు. ఆయన శుక్రవారం ఇతర పోలీస్ అధికారులు, శ్రీదుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం ఇంజినీరింగ్ అధికారులతో కలిసి ఏర్పాట్లు పరిశీలించారు. మున్సిపల్ కార్యాలయం వద్ద నుంచి హెడ్ వాటర్ వర్క్స్ వద్ద ఏర్పాటు చేసే హోర్డింగ్ ఏరియాలను పరిశీలించారు. బారికేడింగ్ ఎలా చేయాలి, భక్తులు లోనికి వెళ్లడానికి, బయటకు రావడానికి ఏర్పాటు చేసే మార్గాలపై టెంపుల్ ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడి వారికి సూచనలు చేశారు. భద్రతా ఏర్పాట్లపై అధికారులు, పోలీసులకు సూచనలు చేశారు.

చినుకు పడితే నరకమే!

- చిన్నపాటి వర్షానికే విజయవాడలో రహదారులు జలమయం
- వాన నీరంతా రోడ్లపైనే
- అస్తవ్యస్తం డ్రెయినేజీ వ్యవస్థ
- కొద్దిపాటి వర్షానికే... ట్రాఫికర్
- వర్షాలు పడినప్పుడు మాత్రమే అధికారుల హడావుడి
- తాత్కాలిక చర్యలే, శాశ్వత పరిష్కారానికి అడుగులు ఏవీ?

చిన్నపాటి వర్షానికే విజయవాడ వణుకుతోంది. చినుకుపడితే నగరంలో మురుగు కాల్వలు పొంగిపొర్లుతున్నాయి. రోడ్లు నీట మునుగుతున్నాయి. లోతట్టు ప్రాంతాల ప్రజలు అవస్థ పడుతున్నారు. మురుగునీటి వ్యవస్థ అంతంతమాత్రంగా ఉంటే.. మరోవైపు అసంపూర్తి పనులు మరింత ఇక్కట్లు కలిగిస్తున్నాయి. వాన నీరు, మురుగు కలవడంతో రహదారులు నిండిపోతున్నాయి. కొద్ది పాటి వర్షానికే ట్రాఫిక్ నిలిచిపోతోంది. ఇలా చినుకు పడితే నగర ప్రజలు వణికిపోతున్నారు. వానలు పడినప్పుడు హడావుడి చేసే పాలకులు, అధికార యంత్రాంగం శాశ్వత పరిష్కార దిశగా అడుగులు వేయడం లేదు.

సాక్షి ప్రతినిధి, విజయవాడ: కొద్దిపాటి వర్షానికే బెజవాడ నీటమునుగుతోంది. భారీ వర్షం వస్తే జనాల కష్టాలు మాటల్లో వర్ణించలేం. ప్రధాన రహదారులన్నీ మోకాలులోతు పైన నీటితో చెరువులను తలపిస్తున్నాయి. వాన ఆగిన తర్వాత నగరవాసులు గమ్యస్థానాలకు వెళ్లొచ్చని.. రోడ్డెక్కితే వారి అవస్థలు వర్ణనాతీతం. ప్రజలు రహదార్ల పైకి రాలేని దుస్థితి. ప్రధాన రోడ్లపై గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోతోంది. పొరపాటున సందుగొందుల్లోకి వెళితే టూ వీలర్ అయితే బయటికి రాలేని పరిస్థితి. వర్షాలు పడినప్పుడు, నగరపాలక సంస్థ అధికారులు హడావుడి చేసి తాత్కాలిక ఉపశమనం చేయడమేగానీ, శాశ్వత పరిష్కారం దిశగా ప్రభుత్వం అడుగులు వేయకపోవడమే ఈ దుస్థితికి కారణం. ప్రధానంగా నగరానికే తలమానికమైన బందరు రోడ్డు, ఏలూరు రోడ్డు, పాలిక్లినిక్ రహదారులు వాగులను తలపిస్తున్నాయి.



విజయవాడ ఎంజీ రోడ్డులో నిలిచిన వాన నీరు

చినుకుపడితే నగరంలో నీరు నిల్వ ఉండే ప్రాంతాలు ఇవే

- విజయవాడ తూర్పు నియోజక వర్గంలో పిన్నమనేని పాలీక్లినిక్ రోడ్డు, బెంజిసర్కిల్, పటమట లంక అండర్ పాస్, మార్గ కృష్ణయ్య, నిర్మల కాన్వెంట్ రోడ్డు, ఆటోనగర్ గేట్, ఆకాశవాణి, ఏపీఐఐసీ కాలనీ, పీఅండ్‌టీ కాలనీ, ఎయిర్ పోర్ట్ కారిడార్, పుల్లేటి కట్ట డ్రెయిన్ సమీప ప్రాంతాలు, బాయన బాపూజీ రోడ్డు, ఆయుష్ ఆస్పత్రి రోడ్డు, జాతీయ రహదారిపై వంతెన పక్కన, రమేష్ ఆస్పత్రి కూడలి, డీవీ మానర్ రోడ్డు వంటి ప్రాంతాల్లో రోడ్లపై నీరు భారీగా నిల్వ ఉంటుంది.
- సెంట్రల్ నియోజకవర్గంలో బందరు రోడ్డు (రాఘవయ్య పార్కు), రామవరప్పాడు రింగ్, మధురానగర్, ఆర్‌యూబీ ప్రాంతాలు, ప్రకాశం రోడ్డు, విజయటాకీస్ సెంటర్, ఆంజనేయ స్వామి గుడి, వేముల శ్యామలాదేవి రోడ్డు, ప్రజా వైద్యశాల, సత్యనారాయణ పురం, స్వర ఆస్పత్రి, భానునగర్, లోటస్ ల్యాండ్ మార్క్, రామ మందిరం రోడ్డు, వ్యాకరణంవారి వీధి, గాంధీనగర్, ఎన్నార్పీ రోడ్డు, సింగ్‌నగర్ ఆర్‌యూబీ, పటేల్ నగర్, ఎల్‌బీనగర్ అంతర్గత రహదారులు, రాజీవ్‌నగర్ కట్ట అంతర్గత రోడ్లు, కండ్రిక, సింగ్‌నగర్ మెయిన్‌రోడ్డు, నూజివీడురోడ్డు (బర్మాకాలనీ) వంటి ప్రాంతాలు ప్రధానంగా ప్రభావితమవుతున్నాయి.
- విజయవాడ పశ్చిమ నియోజక వర్గంలో విద్యాధరపురం హెడ్ వాటర్ వర్క్స్‌పక్కన, కుమ్మరిపాలెం సెంటర్, వీఎంసీ మెయిన్ ఆఫీసు అండర్ పాస్ యంత్రాలు, లో బ్రిడ్జి, దుర్గగుడి దిగువ ఉన్నాయి, నగరపాలక సంస్థ అధికారులే 42 ప్రాంతాల్లో వర్షం వస్తే నీరు నిల్వ ఉంటుందని గుర్తించడం గమనార్హం. దీంతో పాటు భవానీపురం సమీపంలో లోతట్టు ప్రాంతాలున్నాయి.

ఎందుకీ దుస్థితి అంటే....

వాన నీరు ముందుగా రోడ్ల వెంట ఉన్న స్ట్రామ్ వాటర్ డ్రెయిన్‌లోకి వెళ్తుంది. అక్కడ నుంచి మేజర్ అవుట్‌ఫాల్ డ్రెయిన్‌లోకి చేరుతోంది. ఈ డ్రెయిన్లు కంటిన్యుటీగా లేవు. నగరంలో ఇప్పుడున్న స్ట్రామ్ వాటర్ డ్రెయిన్లు, అవుట్‌ఫాల్ డ్రెయిన్‌లు సరిపోవడం లేదు. డ్రెయిన్లు ఎప్పుడో నిర్మించినవి కావడం.. అవి తగిన పరిణామంలో లేకపోవడం, చిన్నవిగా ఉండటంతో వర్షం నీరు వేగంగా ప్రవహించడం లేదు. ఎక్కడిక్కడ డ్రెయిన్లపై సిమెంటు నిర్మాణాలు చేపట్టడంతో ఇబ్బందికరంగా మారింది. ప్రధానంగా విజయవాడ పశ్చిమ, సెంట్రల్ నియోజకవర్గంలో అవుట్‌ఫాల్ డ్రెయిన్లు బుడమేరులో కలుస్తాయి, ఇవి ఎప్పుడో నిర్మించినవి కావడంతో ప్రస్తుతం ఉన్న అవసరాలకు సరిపోవడం లేదు.

అసంపూర్తి పనులు

తూర్పులో పుల్లేటి కాల్వ, గుంటతిప్ప కాల్వ పనులు అసంపూర్తిగా ఉండటంతో నీరు బయటికి వెళ్లడం లేదు. నగరంలో అవుట్‌ఫాల్ డ్రెయిన్లు సరిగా పని చేయడం లేదు. దీంతో చిన్నపాటి వర్షానికే రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. రోడ్లపైన మోకాలి లోతుకుపైగా నీరు చేరి గంటల తరబడి నిలుస్తోంది. నగరం ఈ దుస్థితి నుంచి గట్టెక్కాలంటే అవుట్‌ఫాల్ డ్రెయిన్లలో నీరు ప్రవహించేలా ఆధునీకరించాల్సి ఉంది. వర్షం పడినప్పుడు, నగరపాలక సంస్థ అధికారులు తాత్కాలిక చర్యలు చేపట్టి మమ అనిపిస్తున్నా, పూర్తిస్థాయి పరిష్కారం దిశగా అడుగులు వేయాల్సిన అవశ్యకత ఎంతైనా ఉంది.



బందరు రోడ్డులో నిలిచిన వాన నీరు

మరింత పారదర్శకంగా 'స్వమిత్వ'

కలెక్టర్ డీకే బాలాజీ



మడకలో స్వమిత్వ సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ బాలాజీ, జేసీ గీతాంజలి శర్మ

పెడన: భవిష్యత్‌లో స్వమిత్వ పథకం మరింత పారదర్శకంగా ఉండటానికి పటిష్ట చర్యలు తీసుకోవడానికి నివేదిక రూపొందిస్తున్నామని కృష్ణా కలెక్టర్ డీకే బాలాజీ స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ ఫర్హీన్ జాహిదాలతో కలిసి మండలంలోని నేలకొండపల్లి, మడక గ్రామ పంచాయతీలను సందర్శించారు. ఈ సందర్భంగా అంతకు ముందు స్వమిత్వ సర్వే ఏ విధంగా చేసిందో రికార్డులు, మ్యాపులు, ఆన్‌లైన్ నమోదు తదితర వాటిని పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడి సర్వే సమయంలో ఎదురైన ఇబ్బందులు, సమస్యలు, గ్రామస్తుల నుంచి వచ్చిన అభ్యంతరాలను వాటిని ఎలా ఎదుర్కొన్నది తదితర విషయాలపై ఆరా తీశారు. సర్వే సమయంలో సిబ్బంది సరిపోతారా లేక అదనంగా ఏమైనా కావాల్సి ఉందా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ బాలాజీ మీడియాతో మాట్లాడుతూ గ్రామాల్లో గ్రామకంఠాల్లో ఇళ్లు, ఖాళీ స్థలాలపై ప్రజలకు యాజమాన్య హక్కులు కల్పించడం స్వమిత్వ పథకం ముఖ్య ఉద్దేశమన్నారు. నేలకొండపల్లి, మడక గ్రామాల్లో గతంలోనే సర్వే పూర్తైందని, ఆ సమయంలో క్షేత్రస్థాయిలో తలెత్తిన సమస్యలు, అందుకు అనుసరించిన విధి విధానాల గురించి సంబంధిత అధికారులు, సిబ్బంది నుంచి వివరాలు సేకరించామన్నారు. వీరితో పాటు జిల్లా పంచాయతీ అధికారి అరుణకుమారి, భూ రికార్డులు ల్యాండ్ సర్వే ఏడీ జోషిలా, డీఎల్‌పీవో రజావుల్లా, డీఎల్‌డీవో పద్మావతి, స్వమిత్వ నోడల్ అధికారి శైలజ తదితరులు పాల్గొన్నారు.

నిద్ర చేయడానికొచ్చి శాశ్వత నిద్రలోకి..

- ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న లారీ
- మూడు నెలల చిన్నారి సహా తల్లి మృతి
- బాబు పుట్టాడని పిన్ని ఇంటికి నిద్ర చేయడానికి వచ్చిన బాలింత



కీసరలో లారీ ఢీకొనగా మృతి చెందిన చిన్నారి



చిన్నారి తల్లి చైతన్య (ఫైల్)

కంచికచర్ల: కొడుకు పుట్టాడని చిన్నమ్మ ఇంట్లో నిద్ర చేయటానికి వచ్చిన ఓ బాలింత, మూడు నెలల కుమారుడు శాశ్వత నిద్రలోకి వెళ్లిపోయారు. రోడ్డు ప్రమాదంలో తల్లీకుమారుడు దుర్మరణం చెందగా మరొక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. విషాద ఘటన శుక్రవారం ఎన్టీఆర్ జిల్లా కంచకచర్ల మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రం ఎ.కొండూరుకు చెందిన నాగబత్తుల చైతన్యకు విజయవాడకు చెందిన నవీన్‌తో ఏడాది క్రితం వివాహమైంది. అతను విజయవాడలోని ఓ సినిమా థియేటర్‌లో పని చేస్తుంటాడు. వారికి మగ బిడ్డ పుట్టగా ఆర్జిక్ చైతన్య అని నామకరణం చేశారు. చైతన్య కంచికచర్ల మండలం కీసరలో నివసిస్తున్న పిన్ని ఇంట్లో నిద్రచేసేందుకు మూడు నెలల బాబుతో కలసి బస్సులో వచ్చింది. కీసర సెంటర్‌లో బస్సు దిగానంటూ పిన్నికి ఫోన్ చేసింది. ఆమె చైతన్యను తీసుకురావాల్సిందిగా పొరుగింట్లో ఉండే శ్రీకాంత్ అనే వ్యక్తిని కోరింది. వెంటనే బస్టాప్‌నకు వెళ్లిన శ్రీకాంత్ తల్లీబిడ్డను బైక్‌పై ఎక్కించుకుంటున్నాడు. అదే సమయంలో విజయవాడ వైపు నుంచి హైదరాబాద్ వైపునకు వేగంగా వెళ్తున్న లారీ వీరి బైక్‌ను ఢీకొట్టింది. ఘటనలో చిన్నారి ఆర్జిక్ అక్కడికక్కడే మరణించాడు. చైతన్య, శ్రీకాంత్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు వారిని హైవే అంబులెన్స్‌లో నందిగామ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం విజయవాడ తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ చైతన్య మృతి చెందింది. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. లారీడ్రైవర్ పరారయ్యాడు. పోలీసులు లారీని స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పదవులన్నీ మాకే కావాలి

- 'ఎంయూడీఏ' పదవిపై మంత్రి కన్ను
- అనుచరుడికి ఇప్పించేందుకే రాజకీయం
- చైర్మన్ పదవిని అలంకారప్రాయంగా మార్చి రాజీనామా చేసేలా కుట్ర
- ఈ పదవి వద్దని కోరటంతో బీజేపీ రాష్ట్ర నాయకత్వంలో స్థానం

చిలకలపూడి(మచిలీపట్నం): అధికారంలోకి వచ్చేందుకు బీజేపీ, జనసేన పార్టీలతో జట్టు కట్టినప్పటికీ పదవులు మాత్రం మాకే కావాలనే తీరులో టీడీపీ నాయకులు వ్యవహరిస్తున్నారు. ప్రతి కార్యక్రమంలో కూటమి నాయకులను కలుపుకెళ్తున్నట్లు బహిరంగంగా కనపడుతున్నా వ్యక్తిగతంగా ఎవరి రాజకీయం వారిదిగా మారింది. దీనికి ఉదాహరణే ఎంయూడీఏ (ముడా) చైర్మన్ పదవిపై కన్నేసిన మంత్రి కొల్లు రవీంద్ర చేసిన రాజకీయం. తాను అనుకున్న వారికి పదవిని అప్పజెప్పేందుకు అడ్డగోలుగా వ్యవహరించి పదవిని దక్కించుకునేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నారు.

ఆ పదవిపై మంత్రి కన్ను

మచిలీపట్నం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(ఎంయుడీఏ) చైర్మన్ పదవిని తన అనుచరులకు ఇప్పించుకునేందుకు మంత్రి రవీంద్ర కన్నేశారు.

అయితే ఈ పదవికి బీజేపీకి చెందిన మట్టా ప్రసాద్‌ను అప్పట్లో అధిష్టానం నియమించింది. దీన్ని సహించలేని మంత్రి పైకి అంగీకరించినట్లు కనిపించారు.

పనులు చేయడానికి వీల్లేదని మంత్రి మౌఖిక ఆదేశాలు!

తనకు ఎప్పటి నుంచో ఇసుక మాఫియాలో సహకరిస్తున్న ఓ చోటా నాయకుడికి ఈ పదవిని ఇప్పించేందుకు ఉవ్విళ్లూరుతున్న రవీంద్ర తన మార్కు రాజకీయాన్ని ప్రారంభించారు. ముడా చైర్మన్ పదవిలో మట్టా ప్రసాద్ కొనసాగుతున్నా ఎటువంటి పనులు చేసేందుకు వీల్లేదని అధికారులకు మంత్రి మౌఖిక ఆదేశాలు ఇచ్చినట్లు సమాచారం. దీంతో ఆయన పదవి అలంకారప్రాయంగా మారింది.

ఈ పదవి వద్దు

తాను పదవిలో తొమ్మిది నెలలుగా ఉంటున్నా తమ పార్టీ కూడా అధికారంలో భాగస్వామి అయినప్పటికీ ఏమి చేయలేక ముడా చైర్మన్ మట్టా ప్రసాద్ నిరుత్సాహంతో ఉన్నట్లు తెలుస్తోంది. మంత్రి కొల్లు రవీంద్ర వ్యవహారంతో విసిగిపోయిన మట్టా ప్రసాద్ బీజేపీ పెద్దల వద్ద విషయాన్ని వివరించి తనకు ఈ పదవి వద్దని రాజీనామా చేస్తానని తేల్చి చెప్పినట్లు విశ్వసనీయ సమాచారం. దీంతో చేసేది లేక మట్టా ప్రసాద్‌కు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పదవిని ఇచ్చింది. దీంతో ఆయన వెంటనే ముడా చైర్మన్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు కలెక్టర్ డీకే బాలాజీకి శుక్రవారం లేఖను అందజేశారు.

ఆహారం కల్తీ.. ఆరోగ్యం అంతే

- జీర్ణకోశ వ్యాధులతో పాటు, క్యాన్సర్‌కు దారితీస్తున్న వైనం
- గుండెపోటు, మెదడుపోటు కూడా...
- ఆహార నియమాలు తప్పనిసరి అంటున్న వైద్యులు





లబ్బీపేట(విజయవాడతూర్పు): కల్తీ ఆహారం... ప్రజలను అనారోగ్యం పాల్జేస్తోంది. నగరంలోని హోటల్స్ నుంచి రెస్టారెంట్‌ల దాకా, కార్పొరేట్ స్వీట్స్ షాపుల నుంచి రోడ్డు పక్కన అమ్మే పానీ పూరి బళ్ల వరకూ అన్నీ కల్తీ జరుగుతున్నాయి. వాడిన నూనెనే ఐదారుసార్లు వాడటం, రంగు, రుచికోసం రసాయనాల వినియోగం వంటి వాటితో ప్రజలను అనారోగ్యం పాల్జేస్తున్నాయి. సమయపాలన లేని ఆహార అలవాట్లు కొంపముంచుతున్నాయి.

అప్రమత్తం కాకుంటే పెనుముప్పే

అర్ధరాత్రి దాటిన తర్వాత కూడా రెస్టారెంట్‌లు, ఫుడ్ కోర్టుల్లో బిర్యానీలు లాగించేస్తుండటంతో తొలుత జీర్ణాశయ వ్యాధులు, అనంతరం ప్రాణాపాయ స్థితికి దారితీస్తున్నాయి. ఇటీవల నగరంలో నమోదవుతున్న, లివర్ సిర్రోసిస్, పాంక్రియాటైటీస్, క్యాన్సర్ కేసులు చూస్తుంటే ఆందోళన కలిగిస్తున్నాయి. నాలుగు పదుల వయస్సులోనే జీర్ణాశయ, పెద్దపేగు, లివర్ క్యాన్సర్ సోకుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రిల్లో ఈ రకం వ్యాధులే ఎక్కువగా వస్తున్నాయి. అన్నవాహిక క్యాన్సర్‌లు కూడా నమోదవుతున్నాయి. ఇప్పటికైనా అప్రమత్తం కాకుంటే రానున్న కాలంలో పెనుముప్పు పొంచి ఉన్నట్లు హెచ్చరిస్తున్నారు.

ఇవే నిదర్శనం

- గాంధీనగర్‌కు చెందిన 40 ఏళ్ల వ్యాపారి అర్ధరాత్రి వరకూ బిజినెస్ వ్యవహారాలు చూస్తుంటారు. అనంతరం తరచూ స్నేహితులతో కలిసి బయట ఎక్కువగా నాన్‌వెజ్ వంటకాలు తింటుంటారు. ఇటీవల తరచూ కడుపునొప్పి రావడం, అరుగుదల తగ్గడంతో వైద్యుని వద్దకు వెళ్లారు.అక్కడ పరీక్షలు చేసి జీర్ణాశ్రయ క్యాన్సర్ వచ్చినట్లు నిర్ధారించారు.
- కానూరుకు చెందిన ఓ ఉద్యోగి వారంలో నాలుగు రోజులు బయట హోటళ్లలో భోజనం చేస్తుంటారు. నాన్‌వెజ్, బిర్యానీలు లాగించేస్తుంటారు. దీంతో అతనికి తరచూ కడుపునొప్పితో పాటు, విరోచనంలో రక్తం పడటంతో అనుమానం వచ్చి వైద్యుడిని సంప్రదించారు. పెద్ద పేగు క్యాన్సర్‌గా నిర్ధారించారు.

వీరద్దరే కాదు.. ఇటీవల వైద్యులను సంప్రదిస్తున్న వారిలో పెద్దపేగు, జీర్ణాశయ, లివర్ వ్యాధులు ఎక్కువగా వస్తున్నట్లు చెపుతున్నారు. అందుకు కల్తీ ఆహారమే కారణంగా పేర్కొంటున్నారు.

జీవనశైలి వ్యాధులకు దారి తీస్తున్న వైనం

ఆహార నియమాలు పాటించక పోవడంతో ఒబెసిటీకి దారితీసి క్రమేణా జీవనశైలి వ్యాధులకు దారి తీస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు. అలాంటి వారిలో మధుమేహం, రక్తపోటుతో పాటు, హైపో థైరాయిడ్ వంటి వ్యాధులు సోకుతున్నట్లు చెబుతున్నారు. ప్రతి ఒక్కరూ ఆహార నియమాలు పాటించడంతో పాటు, రెగ్యులర్‌గా వ్యాయామం చేయడం ఎంతో ముఖ్యమంటున్నారు. ఈ విషయంలో అప్రమత్తం కాకుంటే రానున్న రోజుల్లో వ్యాధుల ముప్పు పొంచి ఉన్నట్లు వైద్యులు హెచ్చరిస్తున్నారు.

కొంపముంచుతున్న కల్తీ

నాన్‌వెజ్ వంటకాలు ఆకర్షణీయంగా కనిపించేందుకు రసాయనాలు కలిసిన కారంపొడులు ఎక్కువగా వాడుతుంటారు. మృతజంతువుల కొవ్వు నుంచి తయారు చేసిన కల్తీ నూనెలు వినియోగించి వంటలు చేస్తుండటంతో జీర్ణకోశ వ్యాధులు పెరుగుతున్నట్లు చెబుతున్నారు. అందుకు ఫుడ్ కంట్రోల్ శాఖ వారు నిర్వహించిన తనిఖీల్లో విస్తుపోయే అంశాలు వెలుగు చూశాయి. మాంసాన్ని నిల్వ ఉంచి వంటలు చేయడం, వాడిన నూనెనే మళ్లీ, మళ్లీ వడపోసి వాడటం వంటివి చేస్తున్నట్లు చెపుతున్నారు. బయట ఆహారం తినడం తగ్గించడం ఎంతో ఉత్తమం అని వైద్యులు సూచిస్తున్నారు. జీర్ణకోశ, పెద్దపేగు, అన్నవాహిక క్యాన్సర్‌లకు కల్తీ ఆహారమే ప్రధాన కారణం అంటున్నారు.

అనేక లోపాలు గుర్తించాం



విజయవాడలో నిర్వహించిన తనిఖీల్లో అనేక లోపాలు గుర్తించాం. హోటళ్లు, రెస్టారెంట్‌లలో వండిన రైస్, చికెన్, మటన్ వంటి వాటిని సైతం డీప్ ఫ్రిజ్‌లలో పెట్టి, మళ్లీ వాటిని వాడుతున్నారు. మితిమీరిన రసాయనాలు కలిసిన రంగులను ఆహార పదార్థాల తయారీకి వినియోగిస్తున్నట్లు గుర్తించారు. ముఖ్యంగా కాలపరిమితి ముగిసిన సరుకులను కూడా ఆహారం తయారీకి వాడుతున్నారు. బ్యాకరీ ప్రొడక్ట్స్‌పై సరైన లేబుల్స్ లేని విషయాన్ని తనిఖీల్లో గుర్తించాం. అంతేకాకుండా వంటనూనెనే రీ యూజ్ చేస్తున్నారు. అలా చేస్తే ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు.

–పూర్ణచంద్రరావు, జాయింట్ ఫుడ్ కంట్రోలర్, ఏపీ

అత్యవసరమైతేనే బయట తినాలి



ఇటీవల కాలంలో జీర్ణాశయ, పెద్దపేగు క్యాన్సర్‌లు పెరిగాయి. అందుకు కల్తీ ఆహారం. నాన్‌వెజ్ ఎక్కువగా తీసుకోవడం కూడా కారణంగా చెప్పవచ్చు. ఆహార పదార్థాలు కల్తీ అవుతున్న నేపథ్యంలో అత్యవసరమైతేనే బయట తినాలి. మాంసాహారంలో కలిపే రసాయనిక రంగులు క్యాన్సర్‌కు దారితీస్తున్నాయి. మహిళల్లో శారీరక శ్రమ తగ్గడంతో రొమ్ము క్యాన్సర్‌తో పాటు, గర్భాశయ క్యాన్సర్ కేసులు అధికమయ్యాయి. పట్టణ వాసుల్లో ఎక్కువగా నమోదవుతున్నాయి. క్యాన్సర్‌ను ముందు జాగ్రత్తలతో నివారించగలుగుతాం.

–డాక్టర్ సుబ్బారావు, క్యాన్సర్ వైద్య నిపుణులు

ఈపీటీఎస్‌లో సమాచార నిక్షిప్తంపై దృష్టి పెట్టండి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వివిధ శాఖలు, విభాగాల అంతర్గత పాలనతో పాటు నిర్ణయం తీసుకునే సామర్థ్యాన్ని మెరుగుపరిచే లక్ష్యంతో రియల్‌టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్‌టీజీఎస్) రూపొందించిన ఎంప్లాయీ పెర్ఫార్మెన్స్ ట్రాకింగ్ సిస్టమ్ (ఈపీటీఎస్) పోర్టల్‌లో సమాచారాన్ని ఎప్పటికప్పుడు నిక్షిప్తం చేయడంపై దృష్టిపెట్టాలని కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. ఈపీటీఎస్ పోర్టల్‌లో సమాచారం అప్‌లోడ్ ప్రగతిపై కలెక్టర్ లక్ష్మీశ.. కలెక్టరేట్ సెక్షన్ల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కలెక్టరేట్ విభాగాల సూపరింటెండెంట్లతో పాటు శాఖలవారీగా జిల్లాస్థాయి అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు డేటా అప్‌లోడ్‌పై ప్రత్యేక దృష్టిపెట్టాలని సూచించారు. సమావేశంలో డీఆర్‌వో ఎం.లక్ష్మీనరసింహం, కలెక్టరేట్ ఏవో ఎ.శ్రీనివాస్‌రెడ్డి, కోఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ పి.సలీమ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వాక్కాయలతో విలువ ఆధారిత ఉత్పత్తులపై శిక్షణ



ఘంటసాలపాలెం(ఘంటసాల): మండలంలోని ఘంటసాలపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం వాక్కాయలతో విలువ ఆధారిత ఉత్పత్తులపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఘంటసాల కేవీకే గృహ విజ్ఞాన శాస్త్రవేత్త జి.కృష్ణవేణి వాక్కాయ (కరోండా)లతో లభించే పోషకాలు, ఆరోగ్య ప్రయోజనాలు, వాక్కాయలతో విలువ ఆధారిత ఉత్పత్తులైన జామ్, నిల్వ పచ్చడి, ఒరుగులు, వడియాలు మొదలైన వాటి గురించి వివరించారు. జామ్, నిల్వ పచ్చడి తయారు చేయించారు. కేవీకే సమన్వయకర్త డాక్టర్ సుధారాణి మాట్లాడుతూ వాక్కాయల్లో లభించే పోషక విలువల గురించి చెప్పి, మొక్కలను జీవకంచెగా నాటుకోవచ్చని, ఆదాయం పొందవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ వి.మంజువాణి, డాక్టర్ కె.రేవతి, డాక్టర్ బి.నవీన్, మహిళలు పాల్గొన్నారు. అనంతరం వయ్యారి భామ అవగాహన వారోత్సవాలు నిర్వహించారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

ఇబ్రహీంపట్నం: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఇబ్రహీంపట్నం పవిత్ర సంగమం రోడ్డులో శుక్రవారం తెల్లవారు జామున జరిగింది. సేకరించిన వివరాల మేరకు స్థానిక ఆర్టీసీ బస్ డిపో సమీపంలోని ప్రసాద్‌నగర్‌లో నివాసం ఉంటున్న బత్తుల దుర్గారావు(50) లారీ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తాడు. కుటుంబంలో భార్యతో తలెత్తిన వివాదాలతో ఇటీవల మద్యం వ్యసనానికి గురయ్యాడు. కుటుంబ సమస్యలపై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు మద్యం మత్తులో పోలీస్ స్టేషన్‌కు వెళ్లాడు. తాగి ఉండటంతో అతనిని ఎవరూ పట్టించుకోలేదు. దీంతో రాత్రంతా తాగుతూ తెల్లవారు జామున పవిత్ర సంగమం వెళ్లే రోడ్డులో ఉన్న చెట్టుకు తన లుంగీతో ఉరేసుకున్నాడు. ఇది గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు దుర్గారావు మృతి చెందినట్లు గుర్తించారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం విజయవాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడికి భార్య, వివాహాలు అయిన ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

సర్వర్ మొరాయింపు.. సాగని రిజిస్ట్రేషన్లు

- మూడు రోజులుగా సాంకేతిక సమస్యతో ఇబ్బందులు
- పట్టించుకోని ప్రభుత్వం, అధికారులు

కంకిపాడు: సర్వర్ మొరాయింపుతో రిజిస్ట్రేషన్‌లు నిలిచిపోతున్నాయి. స్లాట్ బుకింగ్స్ జరగకపోవటంతో రోజుల తరబడి రిజిస్ట్రేషన్ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు. మూడు రోజులుగా సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నా ప్రభుత్వం, అధికారులు ఏ ఒక్కరూ సమస్యను పట్టించుకోకపోవటంతో రిజిస్ట్రేషన్‌లకు వచ్చే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

కృష్ణాజిల్లా వ్యాప్తంగా 13 సబ్ రిజిస్ట్రారు కార్యాలయాలు ఉన్నాయి. అవనిగడ్డ, బంటుమిల్లి, చల్లపల్లి, గుడివాడ, కానుమోలు, కొతవరం, మొవ్వ, పామర్రు, పెడన, మచిలీపట్నం, గన్నవరం, కంకిపాడు, ఉయ్యూరు సబ్ రిజిస్ట్రారు కార్యాలయాల్లో మూడు రోజులుగా సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. మధ్యాహ్నం 12 గంటలు దాటే వరకూ రిజిస్ట్రేషన్ శాఖ వెబ్‌సైట్ తెరుచుకోవటం లేదు. ఈ వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసి స్లాట్ బుక్ చేస్తేనే కానీ స్థలాల రిజిస్ట్రేషన్‌లు, మార్టిగేజ్, ఇతర రిజిస్ట్రేషన్ కార్యాలయ సేవలు అందుబాటులోకి రావు. అయితే సర్వర్ మొరాయిస్తుండటంతో ఆయా సేవలు పొందేందుకు రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు వచ్చే ప్రజలు గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. డాక్యుమెంట్ రైటర్ల కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్స్ చేయించుకునేందుకు నానా పాట్లు పడుతున్నారు.

ఖాళీగా దర్శనమిస్తున్న కార్యాలయాలు

శ్రావణమాసం కావటంతో మంచి రోజులు అని ఎక్కువ మంది ప్రజలు తాము కొనుగోలు చేసిన స్థలాలను రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. కొద్ది రోజులుగా రియల్ వ్యాపారం మందకొడిగా సాగుతోంది. స్థలాల అమ్మకాలు, కొనుగోళ్లు ఆశించిన స్థాయిలో జరగటం లేదు. అయితే జరిగే అరకొర రిజిస్ట్రేషన్‌లు సైతం సకాలంలో జరగటం లేదని ప్రజలు వాపోతున్నారు. వెబ్‌సైట్ మొరాయింపుతో దస్తావేజులు సిద్ధం చేసుకుని, చలానాలు చెల్లించి స్లాట్‌బుకింగ్స్ కోసం రోజంతా ఎదురుచూడాల్సి వస్తోందని చెబుతున్నారు. దీంతో మధ్యాహ్నం వరకూ మూడు రోజులుగా కార్యాలయాలు జనం లేక వెల వెల బోతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రిజిస్ట్రేషన్ శాఖ వెబ్‌సైట్ తరచూ మొరాయిస్తుంది. సాంకేతిక సమస్యలు తలెత్తుతుండటంతో రిజిస్ట్రేషన్ సేవలు సజావుగా అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. తరచూ సర్వర్ సమస్యలు నెలకొంటున్నా అటు అధికారులు, ఇటు ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తుండటం పట్ల ప్రజలు పెదవి విరుస్తున్నారు. సాంకేతిక సమస్యలు తలెత్తకుండా సేవలు మెరుగ్గా అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



కంకిపాడు సబ్ రిజిస్ట్రారు కార్యాలయం



మొరాయిస్తున్న వెబ్‌సైట్

యూరియా కోసం రైతుల పడిగాపులు



యూరియా కోసం తమ వంతు ఎప్పుడు వస్తుందా అని పెడన మండలం నందమూరు పీఏసీఎస్ హాలులో వేచి ఉన్న అన్నదాతలు

యూరియా కోసం రైతులకు పడిగాపులు పడటం తప్పడం లేదు. గ్రామాల్లో సొసైటీల వద్ద, ఎరువుల దుకాణాల వద్ద చాంతాడంత క్యూలైన్లలో నిలబడి తమ వంతు ఎప్పుడొస్తుందా అని గంటల తరబడి ఎదురుచూడాల్సి వస్తోంది. గన్నవరంలో ఓ ఎరువుల దుకాణం వద్ద ఈరోజు వందలాది మంది రైతులు ఎరువుల కోసం క్యూ కట్టారు. ఇచ్చే ఒకట్రెండు బస్తాల కోసం వ్యవసాయ పనులు మానుకుని ఉదయం నుంచి సాయంత్రం వరకు నిరీక్షించాల్సి వస్తోందంటూ వాపోయారు. పెడన మండలం నందమూరు సొసైటీకి గురువారం రాత్రి 550 యూరియా కట్టలు వచ్చాయన్న సమాచారంతో శుక్రవారం ఉదయమే వందలాది మంది రైతులు సొసైటీ వద్దకు చేరుకున్నారు. వారిని అదుపు చేయడానికి పోలీసు బందోబస్తు పెట్టి రైతులకు టోకెన్లు జారీ చేసి వారినందరినీ హాల్లో కూర్చోబెట్టారు. టోకెన్ల వారీగా ఒక్కొక్కరిని పిలిచి వారికి యూరియా కట్టలు అందించేలా చర్యలు తీసుకున్నారు.

– గన్నవరం/ పెడన



గన్నవరంలో ఓ ఎరువుల దుకాణం ముందు బారులు తీరిన రైతులు

యూరియా గోతాంలో శవం

- కంకటావలో కలకలం రేపిన మృతదేహం
- తాగిన మైకంలో కొడుకును హతమార్చిన తండ్రి

గూడూరు: మండలంలోని కంకటావలో సంచిలో కుళ్లిపోయిన మృతదేహం శుక్రవారం కలకలం రేపింది. దీనికి సంబంధించి పోలీసులు వెల్లడించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. కంకటావ గ్రామానికి చెందిన వీరంకి విఘ్నేశ్వర రావు(38) గ్రామంలో ఎలక్ట్రికల్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మద్యానికి బానిసైన విఘ్నేశ్వరరావు భార్యతో తరచూ గొడవలు పడి ఇద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో విడాకులు తీసుకున్నారు. రెండు నెలల క్రితం తల్లి చనిపోవడంతో తండ్రి నిరంజన్‌రావుతో కలిసి విఘ్నేశ్వరరావు నివసిస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఈనెల 9న పూటుగా మద్యం తాగిన విఘ్నేశ్వరరావు తండ్రితో గొడవకు దిగాడు. గొడవ పెద్దదవడంతో ఆవేశంలో నిరంజన్‌రావు కొడుకుపై దుడ్డుకర్రతో దాడి చేయగా విఘ్నేశ్వరరావు మరణించాడు. కొడుకు తన చేతిలో హతమైపోయాడన్న విషయాన్ని గుర్తించిన నిరంజన్ రావు యూరియా సంచిలో కొడుకు మృతదేహాన్ని వేసి ఇంటి సమీపంలోని పంట పొలాల పక్కన ఉన్న బోదె దగ్గర పడేశాడు. పైపెచ్చు తన కొడుకు కనిపించడం లేదంటూ ఊళ్లో వారికి చెప్పుకుంటూ కాలం వెళ్లదీశాడు. శుక్రవారం గొర్రెల కాపరులు సంచి నుంచి దుర్వాసన రావడాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో బందరు డీఎస్పీ సీహెచ్.రాజా, పెడన సీఐ నాగేంద్ర ప్రసాద్, గూడూరు ఎస్‌ఐ కె.ఎస్.వి.సత్యనారాయణ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. సంచి బయటకు లాగి ఊడదీయించగా దానిలో నుంచి మృతదేహం బయటకు వచ్చింది. పోలీసుల విచారణలో కుమారుడిని తానే హత్య చేసినట్లు తండ్రి నిరంజన్‌రావు అంగీకరించినట్లు సమాచారం. మృతుడి సోదరుడు వీరంకి సురేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పెడన సీఐ కె.నాగేంద్ర ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



వీరంకి విఘ్నేశ్వర రావు(ఫైల్)



సంచిలో నుంచి మృతదేహం బయటకు తీయిస్తున్న బందరు డీఎస్పీ రాజా, సీఐ, ఎస్‌ఐ

విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్ దుర్మరణం



చల్లపల్లి: విద్యుత్ స్తంభంపై షాక్‌కు గురై అక్కడి నుంచి కిందపడి ఎలక్ట్రీషియన్ మృతి చెందిన ఘటన మండల పరిధిలోని యార్లగడ్డలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే యార్లగడ్డ గ్రామానికి చెందిన బండారు బుజ్జి(48) యార్లగడ్డ పంచాయతీ కార్యాలయంలో వీధిలైట్ల ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. సర్వీసు వైరు విద్యుత్ తీగలకు కట్టే క్రమంలో ఎల్‌టీ లైను ఆపి స్తంభం ఎక్కి వైరు చుడుతుండగా పైనున్న మెయిన్ లైన్ తగిలి కరెంటు షాక్‌కు గురయ్యాడు. దాంతో అక్కడ నుంచి కిందపడిపోయాడు. వెంటనే చల్లపల్లి ఆసుపత్రికి తీసుకువెళుతుండగా, మార్గంమధ్యలో 108 వాహనం వచ్చి పరీక్షించగా అప్పటికే అతను మృతి చెందినట్లు నిర్ధారించారు. కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం బుజ్జి మృతదేహాన్ని అవనిగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం



వత్సవాయి: గుర్తు తెలియని వివాహిత మృతదేహం శుక్రవారం గ్రామశివారులోని వేములనర్వ రహదారిలో మోడల్ కాలనీ సమీపంలో దొరికింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు వత్సవాయి గ్రామశివారులోని మోడల్ కాలనీకి సమీపంలోని వ్యవసాయ బావిలో మృతదేహం ఉన్నట్లు స్థానికులు కొందరు చూసి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో వెంటనే పోలీసులు బావి వద్దకు వెళ్లి మృతదేహాన్ని బయటకు తీయించారు. సదరు మహిళ ఎవరు అనేది వివరాలు తెలియరాలేదు. మృతురాలికి సుమారు 30 నుంచి 35 ఏళ్లు ఉంటాయని చెబుతున్నారు. ఒంటిపై నలుపు రంగు, చీర జాకెట్‌తో ఉన్నట్లు చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

ఏపీ చేనేత కార్మిక సంఘం మహాసభలను జయప్రదం చేయండి

పెడన: ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం 11వ రాష్ట్ర మహా సభలు అక్టోబరు 6, 7 తేదీలలో పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో జరుగుతాయని, ఈ సభలను జయప్రదం చేయాలని ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ విజ్ఞప్తిచేశారు. సభలకు సంబంధించిన గోడ పత్రికలను శుక్రవారం స్థానికంగా జిల్లా కమిటీ సభ్యులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేత రంగాన్ని రక్షిస్తామని వాగ్దానాలు చేసి కార్పొరేట్ పవర్ లూమ్స్ యజమానులకు కోట్ల రూపాయల రాయితీలు ఇస్తూ చేనేతకు మరణ శాసనాన్ని రాస్తున్నారని దుయ్యబట్టారు. చేనేతకు కేటాయించిన 11 రకాల రిజర్వేషన్ వస్త్రాలను పవర్ లూమ్స్ యజమానులు తయారు చేస్తుంటే వారిపై చర్యలు తీసుకోకుండా వారిని ప్రోత్సహించడం సరైన పద్ధతి కాదని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో చేనేత సహకార సంఘాలకు రావాల్సిన యారన్ సబ్సిడీ పావలా వడ్డీ కింద రూ.156 కోట్లను సహకార సంఘాలకు చెల్లించాల్సి ఉందన్నారు. ఈ నిధులు విడుదల చేయకపోవడంతో సహకార సంఘాలు బ్యాంకులకు సకాలంలో అప్పులు తీర్చలేకపోతున్నాయన్నారు. నాబార్డ్ సంస్థ సొసైటీలకు చక్ర వడ్డీలు వేస్తోందని, కార్మికులకు పని కల్పించలేక సొసైటీలు మూతపడుతున్నాయన్నారు. ప్రభుత్వం వెంటనే సొసైటీలకు ఇవ్వవలసిన రూ.156 కోట్లను విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. చేనేత కార్మికులకు ఇవ్వాల్సిన రూ.5కోట్లను కూడా తక్షణం విడుదల చేయాలన్నారు. చేనేత కార్మికులకు 200 యూనిట్లు ఉచిత కరెంటు అందరికీ ఇవ్వాలని, సీఎం చంద్రబాబు ప్రకటించిన రూ.25వేలకి వెంటనే విధివిధానాలు ప్రకటించి జీవో విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీ చేనేత కార్మిక సంఘం జిల్లా, పట్టణ నాయకులు గోరురాజు, వాసా గంగాధరరావు, పంచల రామనరసింహారావు, పూట్ల పేరయ్యలింగం, పొన్న సత్యనారాయణ, తిరువీధుల బాపనయ్య తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్ర మహాసభల కరపత్రాలను ఆవిష్కరించిన కార్మిక సంఘ నాయకుడు బాలకృష్ణ తదితరులు

ఐటీఐ కళాశాలల్లో మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

గుడివాడ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ ఓ.మంజులాదేవి

గుడివాడరూరల్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో రెండవ విడత కౌన్సెలింగ్ అనంతరం మిగిలిన సీట్ల భర్తీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గుడివాడ ఐటీఐ కళాశాల కన్వీనర్, ప్రిన్సిపాల్ ఓ.మంజులాదేవి శుక్రవారం కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 8, 10వ తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఐటిఐ.ఏపీ.జీవోవి.ఇన్‌లో దరఖాస్తులను ఈనెల 26వ తేదీలోగా డౌన్‌లోడ్ చేసుకుని పూర్తి చేసి 27వ తేదీలోగా విద్యార్హత ధ్రువీకరణ పత్రాల పరిశీలన పూర్తి చేసుకోవాలన్నారు. ప్రభుత్వ ఐటీఐలో చేరాలనుకునే వారు ఈనెల 29వ తేదీన జరిగే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని, ప్రైవేట్ ఐటీఐలో చేరాలనుకునే వారు ఈనెల 30వ తేదీన జరిగే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని ఆమె కోరారు. మరిన్ని వివరాల కోసం 08674-295953, 82975 74757, 93461 18232 నంబర్లను సంప్రదించాలని కోరారు. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు.

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

గుడివాడరూరల్: రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే ఎస్‌ఐ మెహబూబ్ షరీఫ్ శుక్రవారం తెలిపారు. గుడివాడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలోని దోసపాడు–ఇందుపల్లి రైల్వేస్టేషన్‌ల మధ్యలో గుర్తు తెలియని రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడని చెప్పారు. ఎస్‌ఎల్‌సీ అనే కంపెనీలో పని చేస్తున్నట్లు, అతని పేరు కృష్ణమూర్తి అని ఐడీ కార్డు మృతుని జేబులో దొరికిందన్నారు. మృతుని వివరాలు తెలిసిన వారు సెల్: 9440627570లో సంప్రదించాలని కోరారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్‌ఐ మెహబూబ్ తెలిపారు.



మృతుని ఐడీ కార్డులోని ఫొటో

ప్రహరీ కూలి తాపీ కార్మికుని మృతి



సువార్తరాజు మృతదేహం

కోనేరుసెంటర్: ప్రహరీ కూలి ఓ యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటనపై మచిలీపట్నం పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మచిలీపట్నం నిజాంపేటకు చెందిన ఎ.సువార్తరాజు (22) బందరు మండలం పల్లెపాలెం గ్రామానికి చెందిన అంకెం వెంకన్న తాపీ పనులు చేస్తుంటారు. రోజులానే శుక్రవారం పనికి వెళ్లారు. ఆర్టీసీ కాలనీలో జరుగుతున్న ఓ అపార్ట్‌మెంట్ పనికి వెళ్లిన ఇద్దరు పుట్టింగ్ పనులు చేస్తుండగా పక్క ఇంటి ప్రహరీ ఒక్కసారిగా కూలిపోయింది. ప్రమాదం జరిగిన సమయంలో సువార్తరాజు, వెంకన్న గోడ పక్కన ఉండటంతో గోడ వారిపై పడింది. ఈ ఘటనలో సువార్తరాజు గోడ కింద పడి నలిగిపోగా, వెంకన్న చిన్న చిన్న గాయాలతో గోడ కింద ఇరుక్కుపోయాడు. తోటి కూలీలు సువార్తరాజును చికిత్స నిమిత్తం మచిలీపట్నం సర్వజన ఆసుపత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించినట్లు పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం శనివారం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగిస్తామని చెప్పారు.

వడ్డీతో బీమా మొత్తాన్ని చెల్లించండి

చిలకలపూడి(మచిలీపట్నం): వినియోగదారునికి వడ్డీతో బీమా మొత్తాన్ని చెల్లించాలని వినియోగదారుల కమిషన్ అధ్యక్షుడు నందిపాటి పద్మారెడ్డి, శ్రీలక్ష్మీరాయల శుక్రవారం తీర్పు చెప్పారు. అవనిగడ్డ నియోజకవర్గం అశ్వారావుపాలెం గ్రామానికి చెందిన విశ్వనాథుని యువకిషోర్‌కు శంషాబాద్ ఎస్‌బీఐ బ్యాంక్‌లో సెంటర్ ఆర్మ్‌డ్ పోలీస్ శాలరీ ప్యాకేజీ ఉంది. దీనికి పర్సనల్ యాక్సిడెంట్ డెత్ ఇన్సూరెన్స్ కవరేజీ రూ.50 లక్షలకు బీమా ఉంది. 2023 జూన్ 7వ తేదీన యువకిషోర్ ప్రమాదవశాత్తు మేడపై నుంచి పడి మరణించారు. బీమా క్లయిమ్ కోసం కిషోర్ భార్య అనూష ఇన్సూరెన్స్ కంపెనీని సంప్రదించగా వారు ఇది యాక్సిడెంటల్ డెత్ కాదని తిరస్కరించారు. దీంతో ఆమె వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించడంతో కమిషన్ సభ్యులు పూర్వాపరాలు విచారించిన అనంతరం రూ.50 లక్షల బీమా మొత్తాన్ని క్లయిమ్ తిరస్కరించిన తేదీ నుంచి 9 శాతం వడ్డీతో చెల్లించాలని, మానసిక వేదన కలిగించినందుకు రూ.1.50 లక్షలు, ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు తీర్పు వెలువడిన 30 రోజుల్లోగా వినియోగదారునికి చెల్లించాలని తీర్పు చెప్పారు.

హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్ శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో షెడ్యూలు కులాలకు చెందిన యువత హెవీ మోటారు వెహికల్ డ్రైవింగ్ శిక్షణకు ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని, ఆసక్తి కలిగిన యువత దరఖాస్తు చేసుకోవాలని ఎస్సీ కార్పొరేషన్ ఇన్‌చార్జ్ ఈడీ షేక్ షాహెద్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి అభ్యర్థికి శిక్షణ కోసం రూ.20 వేలు తమ కార్పొరేషన్ భరిస్తుందన్నారు. జిల్లా నుంచి ఐదుగురు పురుషులు, ఐదుగురు మహిళలు మొత్తం 10 మంది అభ్యర్థులను కలెక్టర్ ఆధ్వర్యంలో నియమించిన కమిటీ అర్హతల మేరకు ఎంపిక చేస్తుందన్నారు. దరఖాస్తుదారులు లైట్ మోటారు వెహికల్ తీసుకుని కనీసం ఒక సంవత్సరం అయి ఉండాలన్నారు. హెవీ డ్రైవింగ్ లెర్నర్ లైసెన్సు కలిగి ఉండాలన్నారు. వయో పరిమితి 20 నుంచి 40 సంవత్సరాల మధ్య ఉండాలన్నారు. ఏపీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యంలో డ్రైవింగ్ శిక్షణ ఇస్తారన్నారు. శిక్షణ వ్యవధి 40 రోజులు ఉంటుందన్నారు. దరఖాస్తులను ఆగస్టు 27వ తేదీలోగా కలెక్టరేట్‌లోని ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో నేరుగా అందజేయాలన్నారు. మరిన్ని వివరాలకు 96520 57244, 9848214161 నంబర్లను సంప్రదించాలన్నారు.